# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 07-05-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ పెహల్గాం ఉగ్రదాడికి ప్రతి స్పందనగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ కు నేటితో ఏడాది పూర్తి అయ్యింది.

- ❖ సరిహద్దు ఉగ్రవాదానికి అందిస్తున్న ప్రోత్సాహానికి పాకిస్తాన్ కు “ఆపరేషన్ సిందూర్”తో భారత్ తగిన విధంగా సమాధానం ఇచ్చిందని విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొంది.

- ❖ నూతన కార్మిక చట్టాల కింద 40 ఏళ్లు పైబడిన కార్మికుల కోసం వార్షిక ఆరోగ్య పరీక్షల కార్యక్రమాన్ని కేంద్రమంత్రి మన్సుఖ్ మాండవీయా ప్రారంభించారు.

- ❖ పశ్చిమ బెంగాల్ కేబినెట్ ను గవర్నర్ ఆర్.ఎన్. రవి ఈరోజు రద్దు చేశారు.

- ❖ లక్నోలోని ఏక్నా స్టేడియం వేదికగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, లక్నో సూపర్ జెయింట్స్ జట్ల మధ్య ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

“ఆపరేషన్ సిందూర్” ద్వారా దేశం సాధించిన అసాధారణ విజయం మన సాయుధ దళాల సాటిలేని ధైర్యసాహసాలను ప్రతిబింబిస్తోందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా... మన సైనికుల శౌర్యం, త్యాగం, వృత్తి నైపుణ్యానికి ఈరోజు దేశం సెల్యూట్ చేస్తోందని రాష్టపతి సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ ఉగ్రవాదానికి వ్యతిరేకంగా, దేశ సార్వభౌమాధికారానికి, పౌరుల భద్రతకు ముప్పు కలిగించే శక్తులకు వ్యతిరేకంగా భారత్ సంకల్పాన్ని చాటి చెప్పిందని అభివర్ణించారు. అదే విధంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పందిస్తూ... ఉగ్రవాదాన్ని తుదముట్టించే విషయంలో భారతదేశం నిబద్ధతతో ఉందని స్పష్టం చేశారు. పహల్గామ్ లో అమాయక భారతీయులపై దాడి చేసిన వారికి మన సైన్యం తగిన బుద్ధి చెప్పిందని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. ఉగ్రవాదంపై భారత్ ఉక్కు సంకల్పాన్ని, జాతీయ భద్రత పట్ల రాజీలేని నిబద్ధతను ఈ ఆపరేషన్ ప్రతిబింబిస్తుందన్నారు. వీర జవానుల పరాక్రమానికి యావత్ దేశం గర్విస్తూ.. వారికి జేజేలు పలుకుతోందని నరేంద్ర మోదీ తన సందేశంలో పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

సరిహద్దు ఉగ్రవాదానికి అందిస్తున్న ప్రోత్సాహానికి పాకిస్తాన్ కు “ఆపరేషన్ సిందూర్”తో భారత్ తగిన విధంగా సమాధానం ఇచ్చిందని విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ అన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... సరిహద్దు ఉగ్రవాదాన్ని పాకిస్తాన్ గత కొన్ని దశాబ్దాలుగా ఒక సాధనంగా వాడుకుంటోందని చెప్పారు. ఉగ్రవాదం నుండి తనను తాను రక్షించుకునే పూర్తి హక్కు భారతదేశానికి ఉందని, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా జరుగుతున్న ప్రపంచ పోరాటాన్ని బలోపేతం చేయడానికి కృషి చేస్తూనే ఉంటుందని రణధీర్ జైస్వాల్ ఉద్ఘాటించారు.

(వాయిస్ 18 సెకన్లు)

అదే విధంగా సింధు జలాల ఒప్పందంపై ఆయన మాట్లాడుతూ... పాకిస్తాన్ సరిహద్దు ఉగ్రవాదానికి నిరంతరం మద్దతు ఇస్తున్నందున ఆ ఒప్పందం నిలిపివేయబడిందని తెలిపారు. సరిహద్దు ఉగ్రవాదానికి పాకిస్తాన్ తన మద్దతును సంపూర్ణంగా విరమించుకోవాల్సిందేనని స్పష్టం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

నూతన కార్మిక చట్టాల కింద 40 ఏళ్లు పైబడిన కార్మికుల కోసం దేశవ్యాప్తంగా వార్షిక ఆరోగ్య పరీక్షల కార్యక్రమాన్ని కేంద్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయా ఈరోజు ప్రారంభించారు. న్యూఢిల్లీలోని ESIC మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ... ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో గత 12 ఏళ్లుగా దేశ కార్మిక వర్గం, యువశక్తి పట్ల గౌరవం గణనీయంగా పెరిగిందని మన్సుఖ్ మాండవీయా చెప్పారు. ఉద్యోగ అవకాశాలను కల్పించడానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని, దాని ఫలితంగా నిరుద్యోగ రేటు సుమారు 3.2 శాతానికి తగ్గిందని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమం వృత్తిపరమైన ఆరోగ్య వ్యవస్థలను బలోపేతం చేయడంలో, భారతదేశ కార్మిక వర్గానికి సమగ్ర ఆరోగ్య సంరక్షణ అందుబాటులోకి తీసుకురావడంలో ఒక కీలక ముందడుగు అని మన్సుఖ్ మాడవీయ వివరిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = =

ఐదేళ్ల కాలపరిమితి ముగియడంలో పశ్చిమ బెంగాల్  కేబినెట్ ను గవర్నర్ ఆర్.ఎన్. రవి ఈరోజు రద్దు చేశారు. ఇటీవల జరిగిన బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ పార్టీ మెజార్టీ దక్కించుకోనప్పటికీ ముఖ్యమంత్రి పదవికి ఆమె రాజీనామా చేయకపోవడంతో గవర్నర్ మంత్రిమండలిని రద్దు చేశారు. శనివారం ఆ రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరనుంది. మొత్తం 293 స్థానాలకు గాను 207 సీట్లలో బీజేపీ అభ్యర్థులు విజయం సాధించి మెజార్టీ దక్కించుకున్నారు. బీజేపీ శాసన సభాపక్షనాయకుడిని ఆ పార్టీ ఎమ్మెల్యేలు రేపు ఎన్నుకోనున్నారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో మాతా శిశు ఆరోగ్య సేవలను బలోపేతం చేసే దిశగా `జనని` పథకాన్ని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఈరోజు ప్రారంభించింది. ప్రత్యుత్పత్తి వయస్సులో ఉన్న మహిళల డిజిటల్ ఆరోగ్య రికార్డులు సమగ్ర పర్యవేక్షణకు ఈ జనని డిజిటల్ ప్లాట్‌ఫామ్ ను రూపొందించారు. ఇప్పటి వరకు ఈ ప్లాట్‌ఫామ్ లో కోటి 34 లక్షల మంది లబ్దిదారులు నమోదు చేసుకున్నట్లు మంత్రిత్వ శాఖ తెలిపింది. ప్రసవానికి ముందు, ప్రసవానంతర సంరక్షణ, నవజాత శిశు సంరక్షణ, చిన్న పిల్లల సంరక్షణ, అలాగే కుటుంబ నియంత్రణ వంటి మాతాశిశు ఆరోగ్య సేవలకు అంతరాయం లేకుండా పర్యవేక్షించడం దీని ప్రధాన లక్ష్యం.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

ఉత్తరప్రదేశ్ లక్నోలోని ఐసీఏఆర్-సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ సబ్‌ట్రాపికల్ హార్టికల్చర్ (సీఐఎస్‌హెచ్)లో నిర్వహించిన `ఫ్రూట్ హారిజన్-2026` సదస్సులో కేంద్ర వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేవలం ఉత్పత్తిని పెంచడం మాత్రమే ఇకపై సరిపోదని, ప్రపంచ పండ్ల మార్కెట్‌లో బలమైన గుర్తింపును నెలకొల్పడానికి భారత్ ఇప్పుడు నాణ్యత, నిల్వ సామర్థ్యం, ప్రాసెసింగ్, లాజిస్టిక్స్, ఎగుమతుల ప్రమాణాలపై కృషి చేయాలని చెప్పారు. వ్యవసాయం ఇకపై కేవలం పొలాలకే పరిమితం కాకూడదని కేంద్రమంత్రి స్పష్టం చేస్తూ.. ఉత్పత్తి నుండి ప్రాసెసింగ్, మార్కెటింగ్, ఎగుమతుల వరకు మొత్తం సరఫరా గొలుసును బలోపేతం చేయడం ప్రస్తుతం చాలా అవసరమన్నారు. దేశంలో పండ్ల ఉత్పత్తి, నాణ్యత పెంపుదల, ప్రాసెసింగ్ ఎగుమతులను ప్రోత్సహించడమే ఈ సదస్సు లక్ష్యమని శివరాజ్ సింగ్ చౌహాన్ పేర్కొంటూ...

(వాయిస్ 27 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = =

బీహార్ కేబినెట్ లో నూతన మంత్రులుగా పలువురు ఈరోజు ప్రమాణ స్వీకారం చేశారు. మొత్తం 32 మంది మంత్రివర్గంతో కూడిన పూర్తిస్థాయి ప్రభుత్వం కొలువుదీరింది. భారతీయ జనతా పార్టీ, జనతాదళ్ యునైటెడ్ జేడీయూ, ఇతర పార్టీలతో కలిసి బీహార్‌లో ఇటీవల ఎన్డీయే ప్రభుత్వం ఏర్పాటయ్యింది. ఈ మంత్రివర్గ విస్తరణలో మాజీ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ కుమారుడు నిశాంత్ కుమార్‌కు చోటు దక్కింది. ఎన్డీయే కూటమిలో బీజేపీకి 15, జేడీయూకు 13, రామ్ విలాస్ ఎల్జేపీకి 2, హెచ్ఏఎం, ఆర్ఎల్ఎం పార్టీలకు ఒక్కో మంత్రి పదవి లభించాయి. పాట్నాలో జరిగిన ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పాటూ.. కేంద్ర మంత్రులు రాజ్ నాథ్ సింగ్, అమిత్ షా, జేపీ నడ్డాలు హాజరయ్యారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

ఉమ్మడి సముద్ర జలాల్లో సంక్షోభ సమయాల్లో వేగవంతమైన సహాయం, భద్రతకు హామీ ఇస్తూ.. భారతదేశం నేడు స్థిరత్వానికి ఒక దృఢమైన స్తంభంగా నిలుస్తోందని కేంద్ర ఓడరేవులు, నౌకాయానం, జలమార్గాల శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ అన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన 10వ “హిందూ మహాసముద్ర డైలాగ్” కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశం సురక్షితమైన, సంపన్నమైన హిందూ మహాసముద్ర ప్రాంతాన్ని క్రియాశీలకంగా తీర్చిదిద్దుతోందని చెప్పారు. గ్లోబల్ సౌత్ కోసం పటిష్టమైన సముద్ర వాతావరణాన్ని నిర్మించడానికి అత్యంత నిర్మాణాత్మకమైన హిందూ మహాసముద్ర తీర ప్రాంత అధ్యక్ష పదవి కోసం భారత్ ఎదురుచూస్తోందని తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలోని పాఠశాల విద్యా వ్యవస్థకు సంబంధించిన విధాన నివేదికను నీతి ఆయోగ్ ఈరోజు విడుదల చేసింది. పాఠశాల ప్రవేశాలు, విద్యార్థుల నమోదు, మౌలిక సదుపాయాలు, సమ్మిళితత్వం, అభ్యాసన ఫలితాలు వంటి కీలక అంశాల ఆధారంగా భారతదేశ పాఠశాల విద్యా వ్యవస్థపై ఒక దశాబ్దం పాటు చేసిన సమగ్ర విశ్లేషణను ఈ నివేదిక అందిస్తుంది. 13 సమగ్ర సిఫార్సులతో కూడిన వివరణాత్మక కార్యాచరణను ఇది తెలియజేస్తుంది. ఇందులో 8 వ్యవస్థాగత సిఫార్సులతో పాటూ.. 5 విద్యా సంబంధిత సిఫార్సులు కూడా ఉన్నాయి. ఇవి మిశ్రమ పాఠశాలలు, హేతుబద్ధీకరణ ద్వారా పాఠశాల నిర్మాణాన్ని సంస్కరించడం వంటి పాఠశాల మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడంపై దృష్టి సారిస్తాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

ఐపీఎల్-2026లో భాగంగా లక్నోలోని ఏక్నా స్టేడియం వేదికగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, లక్నో సూపర్ జెయింట్స్ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. టాస్ గెలిచిన బెంగళూరు తొలుత ఫీల్డింగ్ ఎంచుకోవడంతో బ్యాటింగ్ ప్రారంభించిన లక్నో సూపర్ జెయింట్స్ 9 ఓవర్లు పూర్తయ్యే సరికి వికెట్ నష్టపోకుండా 95 పరుగులు చేసింది.

=======================

=======================